క్లుప్తంగా

టీవైఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శైలజ



తొర్రూరు: తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన నడిగడ్డ శైలజ నియమితులయ్యారు. ఈమేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి కుమార్, జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే పూజలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో సర్పంచ్ సంద వీరన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నర్సింగ వెంకన్న పాల్గొన్నారు.

కమనీయం శ్రీలక్ష్మీ నారాయణుడి కల్యాణం



గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి తిరు కల్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత కనుల పండువగా జరిగాయి. రాత్రి 9గంటలకు పల్లకిలో శ్రీలక్ష్మీదేవి, అశ్వవాహనంపై లక్ష్మీనారాయణస్వామి బయలుదేరి వెళ్లగా, స్థానిక ఏపూరు రవీందర్‌రెడ్డి ఇంటి ఎదుట సంప్రదాయ రీతిలో నిర్వహించిన ఎదుర్కోళ్ల కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. పెద్దెత్తున హాజరైన భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి పులకరించిపోయారు.

సమ్మెకు సంఘీభావం

గార్ల: 20 రోజులుగా చేస్తున్న వీఓఏల సమ్మె శిబిరాన్ని సీపీఐ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నాదేండ్ల పద్మ శనివారం సందర్శించి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, వీఓఏలు అనిత, అరుణ, లత, రమ, వీరలక్ష్మి, జ్యోతి, శారద, సరోజ, మాలతి, శ్రీజ, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని శనివారం రాష్ట్ర హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రాంపల్లి రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల మౌలిక వసతుల కోసం పోరాడాలి



కేసముద్రం: అసంఘటిత రంగ కార్మికుల మౌలిక వసతుల కోసం కలిసికట్టుగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, అనురాధ, విశ్వనాథం, రాసోద్దిన్, శివబాబు, శివారపు శ్రీధర్, వరదయ్య, మదార్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై కేసీఆర్ చిత్రపటం ప్రదర్శన



నెల్లికుదురు: గీత కార్మికులకు రూ.5 లక్షల బీమా ప్రకటించడంతో మండలంలోని వావిలాల గ్రామంలో కాతమయ్య ఆలయ ఆవరణంలో శనివారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో గీత కార్మికులు కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గౌడ అధ్యక్షుడు నాళ్లం వీరన్న, ఉపాధ్యక్షుడు బైరి యుగేందర్, సోమయ్య, మద్దెల రాజేష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. తారు మరిచారు

- 10నెలలు దాటినా ముందుకు సాగని రోడ్డు పనులు
- కంకర మీద నడవాలంటే ఇబ్బంది పడుతున్న గిరిజనులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఆర్లగడ్డతండాలో కంకర పరిచిన రహదారి

మరిపెడ రూరల్: తానంచర్ల రెవెన్యూ పరిధిలోని కోట్యాతండా గ్రామ పంచాయతీ పరిధి రంగాపురం గ్రామ క్రాస్‌రోడ్డు నుంచి ఆర్లగడ్డతండాకు తారు రోడ్డు మంజూరైంది. కిలోమీటరు మేర ఉన్న ఈ తారు రోడ్డుకు సీఆర్ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) నిధుల నుంచి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఇట్టి రహదారికి గత ఏడాది ఆగస్టు 14, 2022లో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పనులు దక్కించుకున్న గుత్తేదారు శంకుస్థాపన వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టాడు. రోడ్డు పనులు ప్రారంభం కాగానే ఆర్లగడ్డతండా వాసులు డొంకదారి తారు రోడ్డు అవుతుందని ఎంతో మురిసిపోయారు. కానీ గుత్తేదారు కిలోమీటరు రోడ్డు దొడ్డు కంకర పరిచి పత్తాలేకుండా పోయాడని గిరిజన వాసులు వాపోతున్నారు. దీంతో కంకర పరిచిన రహదారిపై నడవాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని తండా గిరిజనులు వాపోతున్నారు. అదేవిధంగా మూగ జీవాల రోధన వర్ణనాతీతంగా మారిందన్నారు. పదినెలలు దాటుతున్న రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని, ఇప్పటికైన జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించిన కంకర పరిచిన రోడ్డుపై వెంటనే తారు నిర్మాణం జరిగేల చర్యలు చేపట్టాలని ఆర్లగడ్డ తండా వాసులు కోరుతున్నారు.

పశువులు అరిగోస పడుతున్నాయి..



మేతకు పశువులను తోలుకుని పోవాలంటే కంకర పరిచి ఉన్న రోడ్డుపై మూగ జీవాలు తల్లడిల్లుతున్నాయి. ఇంకా పొలం దున్నే సమయంలో ఎడ్లు కంకరపై నడవలేక అరిగోస పడుతున్నాయి. తారు రోడ్డు వేసి కష్టాలు తొలగించాలి.

- అంగోతు వెంకన్న, రైతు, ఆర్లగడ్డతండా

మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం



కేసముద్రం: తాళ్లపూసపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న వెంకన్న



నెల్లికుదురు: చిన్ననాగారంలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి, కోమటిపల్లి గ్రామాల్లో కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, సర్పంచులు రావుల విజితరవిచందర్‌రెడ్డి, నీలం యాకయ్యతో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి, డైరెక్టర్ నూనావత్ శ్రీను, గొర్రె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం

నెల్లికుదురు: రైతులు పండించిన ప్రతి పంటకు కేసీఆర్ ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తూ రైతులకు బరోసా కల్పిస్తుందని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో శ్రీరామగిరి సొసైటీ, చిన్ననాగారంలో ఐకేపీ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం వరదయ్య, రజిత రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ ఉద్యమం



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీభవన్‌లో చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన పార్టీ పట్టణ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 36వార్డులలో 5 బృందాలుగా ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టామని, దీని ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, చిదిరాల జ్ఞానేశ్వర్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, చిరంజీవి, రవీందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



పెద్దవంగర: కొనుగోలు కేంద్రాల వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేష్

పెద్దవంగర: వాతావరణంలోని మార్పులను దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆర్డీఓ రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ బాబు, ఆర్ఐ లస్కర్, రైతులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఇమ్మానియేల్ శనివారం తనిఖీ చేశారు. కేంద్రంలోని 928 బ్యాగుల వరిధాన్యాన్ని మహబూబాబాద్‌లోని శ్రీనివాస్ రైస్ మిల్లుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



గార్ల: మాట్లాడుతున్న ఎంఈఓ పూల్‌చంద్



మహబూబాబాద్ అర్బన్: శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గార్ల: కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు సమ్మర్ కోచింగ్ సెంటర్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి.పూల్‌చంద్ సూచించారు. శనివారం గార్లలోని బీఎస్ఎస్ పాఠశాలలో సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, నోడల్ అధికారి వెంకట్రామ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు శివ, ఈరు, రామచంద్రు, వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బయ్యారం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న వేసవి శిక్షణను ఉపయోగించుకోవాలని సర్పంచ్ ధనసరి కోటమ్మ సూచించారు. బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం వేసవి శిబిరంను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు లింగరాజు, వెంకటేశ్వర్లు, వీరన్న, ధనుజయ, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: వేసవి కాలంలో విద్యార్థులు క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మానుకోట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా శిక్షణ తరగతులను ఫరీద్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి అనిల్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారధి రెడ్డి, డీఈఈ ఉపేందర్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, కోచ్‌లు వెలిశాల కుమార్, కళ్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దవంగర: గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్షుడు కాసాని అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మండలంలోని ఆయా గ్రామాల కారోబార్లు, సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె రెండో రోజున కొనసాగింది. కార్యక్రమంలో కుమారస్వామి, సుమన్, శ్రీకాంత్, మధుకర్, దేవా, యాకుబ్, వెంకటసోములు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబాబాద అర్బన్: జూన్‌లో జరగనున్న జేఈఈ అడ్వాన్స్ కోసం టీఎంరీస్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజేందర్‌నగర్ కళాశాల ఆఫ్ ఎక్స్‌లెన్స్ కోచింగ్‌కు ఎంపికైన మైనార్టీ కళాశాలకు చెందిన టి.సీతారాముకు మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.ఇమాముద్దీన్ శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థి సీతారాముకు జిల్లా ఇన్‌చార్జ్ మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ శ్రీపాల అభినందించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

గార్ల: గార్లలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కళ్లాల్లో ధాన్యం ఆరబోసి 15రోజులు దాటినా నేటికీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాడు.

పరామర్శ..

కురవి: సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండాలో బానోత్ అరుణ(63, నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మంచ్యా తండాలో రంగి మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు.

మూడు గ్రానైట్ లారీల పట్టివేత

కురవి: అధిక లోడుతో వస్తున్న మూడు గ్రానైట్ లారీలను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని కురవి పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై బి.రాము శనివారం తెలిపారు. ఇనుగుర్తి మండలం నుంచి ఖమ్మంకు మూడు లారీల్లో అధిక లోడుతో నిబంధనలు పాటించకుండా గ్రానైట్‌తో వస్తుండగా జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు కురవిలోని గ్యాస్ ఆఫీసు ఎదురుగా పట్టుకున్నట్లు ఆయన వివరించారు. పట్టుకున్న లారీలను అప్పగించగా, వాటిని ఆర్‌టీఓ, మైనింగ్ అధికారులకు రాయడం జరిగిందని, వారు వాటిని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, చైర్మన్ శ్రీనివాసరావు

కేసముద్రం: విద్యుత్‌ను వినియోగదారులు పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నిర్వహిస్తున్న విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ప్రతిజ్ఞ చేసి, వారోత్సవాల పోస్టర్‌లను హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వారు భద్రతా పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, విద్యుత్ శాఖ డీఈ విజయ్, ఏఈ శ్రీధర్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, సర్పంచ్ బట్టు శ్రీనివాస్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, ఆత్మ చైర్మన్ నెహ్రూరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు సరికాదు

మండల కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావును సన్మానించే క్రమంలో, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వ్యవహరించిన తీరు సరికాదని సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సతీష్ ఆరోపించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా ధన్నసరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని, ధన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో దన్నసరి క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. అంతకు ముందు కేసముద్రంస్టేషన్‌లోని ఆర్యవైశ్యభవన్‌లో హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావును ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, డీఏఓ ఛత్రునాయక్, మార్క్‌ఫెడ్ మేనేజర్ శ్యామ్, ఏడీఎం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం హనుమాన్ భక్తుల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలాధరుల గురుస్వాములు మేరుగు మల్లయ్యగౌడ్, బీరం శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పంచలోహ హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి శోభాయాత్రను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో అన్నదానం చేశారు. వేడుకల్లో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో ఉన్న అర్హులందరికీ దళితబంధు పథకాన్ని అమలు చేసి ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో దళితబంధు అమలు, పథకంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నిరసన దీక్ష శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని స్వయంగా సీఎం ప్రకటించరాని, వెంటనే వారిని పేర్లను ప్రకటించి పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశాడు. దీక్షలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్, మిరియాల శ్రీనివాస్, పోలెపాక ప్రవీణ్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలెపాక శంకర్, బిక్షపతి, మల్లయ్య, ప్రభాకర్, వీరస్వామి, సారయ్య, జీవన్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు భూమి కేటాయింపు



భూపత్రాలు అందిస్తున్న తహసీల్దార్

తొర్రూరు: పట్టణంలో బస్తీ దవాఖాన ఏర్పాటు కోసం రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో భూమిని కేటాయించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో భూకేటాయింపు సంబంధిత పత్రాలను మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ గుండాల మురళీధర్‌లకు తహసీల్దారు నాగేంద్రప్రసాద్ అందించారు. రెండు బస్తీ దవాఖానాల ఏర్పాటు నిమిత్తం చెరువు శివారులోని బతుకమ్మ ఆడే సమీపంలో 500 గజాలు, ఎస్‌బీఐ బ్యాంకు వెనకాల 400 గజాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. పట్టణ వాసులకు మెరుగైన వైద్యం అందేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సింగారపు కుమార్, నాయకులు దొంగరి శంకర్, బిజ్జాల అనిల్ పాల్గొన్నారు.

చీపురుపట్టి జేపీఎస్‌ల శ్రమదానం

సమస్యలు పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న నిరవధిక సమ్మె 9వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శనివారం జేపీఎస్‌లు ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట చీపురు పట్టి శ్రమదానం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



బయ్యారం: శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు



కేసముద్రం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శ్రమదానం చేస్తున్న జేపీఎస్‌లు



గార్ల: ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో..



గూడూరు: మండల పరిషత్ ఎదుట..



మహబూబాబాద్ రూరల్‌లో..

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



మహబూబాబాద్ రూరల్: ఓ వాహనం అతివేగంగా అదుపు తప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లిన సంఘటన జిల్లా బేతోలు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వాహన చోదకుడు అజాగ్రత్తగా వాహనం నడపగా ఆ వాహనం జాతీయ రహదారి 365 పక్కనున్న గడ్డం చెన్నయ్య ఇంట్లోకి దూసుకెళ్లింది. రెండు ఇళ్లు, పక్కనే ఉన్న సెలూన్ షాప్ ధ్వంసం అయింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్ట ప్రమాదం తప్పింది. ఈ ప్రమాద ఘటనలో డ్రైవరుకు స్వల్ప గాయాలయ్యాయి. విషయమై కురవి ఎస్సై రామును వివరణ కోరగా బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో వరంగల్–ఖమ్మం హైవేపై శనివారం బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణం చేస్తున్న పెండ్యాల మనోజ్, ఇమ్మడి పవన్ కల్యాణ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఘటన స్థలంకు పోలీసులు చేరుకొని వారిని చికిత్స నిమిత్తం 108లో తొర్రూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేంకటేశ్వరస్వామికి వినతి



మరిపెడ: జేపీఎస్‌ల దీక్షలో భాగంగా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని గిరిజనుల ఆరాధ్య దైవమైన మాకుల వేంకటేశ్వర స్వామి వారికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు.

విద్యుత్ ప్రమాదాలను నియంత్రించాలి



చిన్నగూడూరు: భద్రత సూచనలు పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నియంత్రించాలని డీఈ మధుసూదన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలను విద్యుత్ అధికారులు, వినియోగదారులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఈ మధుసూదన్ మాట్లాడుతూ విద్యుత్ వాడకం పట్ల జాగ్రత్తగా ఉండి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌ను తమ అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్ రెడ్డి, ఏడీఈ లోకనాథరెడ్డి, ఎస్ఈ నిహాల్, ఏఈ నవ్య, సర్పంచ్ కొమ్ము మల్లయ్య, వినియోగదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.